డీఎస్ఈ ముట్టడికి వచ్చిన మోతీలాల్ నాయక్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

డీఎస్సీని వాయిదా వేయాలని పాఠశాల విద్యా డైరెక్టరేట్ ముట్టడికి వచ్చిన అభ్యర్థులను అడ్డుకుని అరెస్టు చేస్తున్న పోలీసులు

డీఎస్సీకి 90 రోజుల సమయం ఇవ్వాలని ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

సర్కారుతో ఢీఎస్సీ!

మొదటిపేజీ తరువాయి...

సర్కారుపై అభ్యర్థులు దుమ్మెత్తిపోశారు. దఫా దఫాలుగా వచ్చిన అభ్యర్థులు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. నిరుద్యోగులు విడతల వారీగా ముట్టడికి తరలిరావడం, పోలీసులు అడ్డుకోవడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతవరణం నెలకొన్నది. ఈ సందర్భంగా పలువురు నిరుద్యోగ అభ్యర్థులపై పోలీసులు అత్యుత్సాహంతో అనుచితంగా ప్రవర్తించారు.కొందరు పోలీసులు వారిపై దౌర్జన్యంగా వ్యవహరించారు. ఇష్టారీతిన ఈడ్చుకెళ్తూ వ్యాన్లలో నెట్టిపడేశారు. మహిళా అభ్యర్థుల పైనా పోలీసులు విరుచుకుపడ్డారు. ఈ సమయంలో పోలీసులు నిరంకుశ వైఖరిపై డీఎస్సీ అభ్యర్థులు మండిపడ్డారు. అంతా ఒకేసారి కాకుండా దఫదఫాలుగా వచ్చి డీఎస్ఈని ముట్టడించారు. తొలుత నిరుద్యోగ జేఏసీ నేత మోతీలాల్ నాయక్ తన అనుచరులతో కలిసి డీఎస్ఈ కార్యాలయాన్ని ముట్టడించారు. దీంతో ఆయన్ను పోలీసులు అరెస్టుచేశారు.

పాఠశాల విద్య కమిషన్ కార్యాలయ ముట్టడికి భారీ ర్యాలీగా తరలిస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

బృందాలుగా దూసుకొచ్చిన అభ్యర్థులు

ఏజీ ఆఫీస్ జంక్షన్ వైపు నుంచి, లక్డీకాపూల్ రాజ్‌దూత్ జంక్షన్ నుంచి అభ్యర్థులు బృందాలుగా డీఎస్ఈ వైపు దూసుకొచ్చారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య నిరుద్యోగులకు మద్దతుగా నిరుద్యోగులతో కలిసి ర్యాలీగా వచ్చి డీఎస్ఈ ముట్టడిలో పాల్గొన్నారు. బీఆర్ఎస్వీ నేతలు నిరుద్యోగులకు మద్దతుగా డీఎస్ఈని ముట్టడించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. టెట్, టీజీపీఎస్సీ నిర్వహించిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షల వెంటే డీఎస్సీ పరీక్షలను ఎలా నిర్వహిస్తారని పలువురు అభ్యర్థులు ప్రశ్నించారు. 11 వేల పోస్టులతో మెగా డీఎస్సీ ఎలా అంటారని, ఇది దగా డీఎస్సీ అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. డీఎస్సీ పరీక్షలను వాయిదావేసే వరకు పోరాడుతామని వారంతా స్పష్టంచేశారు. పోలీసుల వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ డౌన్ డౌన్, దోపిడీ రాజ్యం, దొంగల రాజ్యం.. అంటూ నిరుద్యోగ యువత నినాదాలు చేసింది.

'వయనాడ్‌లో ప్రచారం చేస్తాం'

నిరుద్యోగులతో పెట్టుకుంటే లాగులూడగొట్టి తమ సత్తా చాటుతామని ముట్టడి సందర్భంగా నిరుద్యోగ అభ్యర్థులు హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భంగపాటు తప్పదని తేల్చిచెప్పారు. మాకు ఐదేండ్లు అధికారాన్నిచ్చారు.. ఏం ఢోకా లేదని సీఎం రేవంత్‌రెడ్డి ధీమాగా ఉన్నాడేమో.. మేం ఢిల్లీకి వెళ్తాం.. వయనాడ్‌లో ప్రియాంకగాంధీకి వ్యతిరేకంగా ప్రచారం చేస్తాం.. అని హెచ్చరించారు. రాష్ట్రంలో త్వరలో జరిగే గ్రామ పంచాయతీ, ఇతర స్థానికసంస్థల ఎన్నికల్లోనూ తమ ప్రతాపం చూపుతామని స్పష్టంచేశారు.

పోలీసుల కాళ్లుమొక్కిన అభ్యర్థి

నిరుద్యోగుల డీఎస్ఈ ముట్టడిని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో తీవ్ర ఆవేదనకు లోనైన ఓ అభ్యర్థి తమకు నిరసన తెలిపేందుకైనా అవకాశం ఇవ్వండి.. అంటూ పోలీసు అధికారుల కాళ్లపై పడి మొక్కాడు. 'సార్.. మేం శాంతియుతంగా నిరసన తెలుపుతున్నాం.. మేమెలాంటి అరాచకాలకు పాల్పడటం లేదు.. మా డిమాండ్లను ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నాం.. ఇప్పుడున్న కాంగ్రెస్ కంటే గత బీఆర్ఎస్ సర్కారే బెటర్‌గా ఉండే' అంటూ ఆవేదన వ్యక్తంచేశాడు. మరో అభ్యర్థి చేతులు జోడించి పోలీసులను మొక్కుతూ సార్ మమ్మల్ని అరెస్టు చేయకండి.. అంటూ పోలీసులను వేడుకున్నాడు. నిరుద్యోగుల తరపున గతంలో ప్రశ్నించిన తీన్మార్ మల్లన్న, బల్మూరి వెంకట్ నేడు ప్రభుత్వానికి తొత్తులుగా మారారని అభ్యర్థులు ధ్వజమెత్తారు.

ఆందోళన చేస్తున్న అభ్యర్థులను చుట్టుముట్టి అరెస్టు చేస్తున్న పోలీసులు

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు దేవీప్రసాద్, పల్లెరవి

మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ

- ఊసేలేని జాబ్ క్యాలెండర్ హామీ
- బీఆర్ఎస్ నేతలు దేవీప్రసాద్, పల్లె రవికుమార్

హైదరాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను, ఉద్యోగులను వంచించిందని బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్, పల్లె రవికుమార్ విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో సోమవారం మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ముం దు నిరుద్యోగుల ఇండ్ల చుట్టూ, అశోక్‌నగర్ కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరిగి వారిని రెచ్చగొట్టిన కాంగ్రెస్, అధికారంలోకి రాగా నే వారి న్యాయమైన కోర్కెలను పట్టించుకోవడం లేదని దేవీప్రసాద్ ధ్వజమెత్తారు. మెగా డీఎస్సీ అంటూ దగా డీఎస్సీ వేశార ని, తక్షణమే 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేయాలని డిమాండ్ చేశారు. కొందరు ఏపీ అధికారులను సచివాలయంలో నియమించి తెలంగాణ ఉద్యోగులపై పెత్తనం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని దేవీప్రసాద్ స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండగా నిరుద్యోగ నేతలు యోధులుగా కనిపించారని, ఇపుడు వారు కాంగ్రెస్‌కు పనికిరాని వారిగా మారారని పల్లె రవికుమార్ ఎద్దేవా చేశారు. నిరుద్యోగ ఉద్యమకారిణి సింధూరెడ్డిని శంఖినిగా పేర్కొనడం ఓ కాంగ్రెస్ ఎమ్మెల్సీ మూర్ఖత్వమని,ఆ వ్యాఖ్యలకు వారు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు న్యాయం జరిగేదాకా వారికి బీఆర్ఎస్ వారికి రక్షణ కవచంలా నిలబడుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మన్నె గోవర్ధన్‌రెడ్డి, ఇస్లావత్ రామచంద్రనాయక్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి అభ్యర్థుల ఆందోళన

- సిటీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిరసన
- విద్యుత్తును తొలగించిన పోలీసులు
- సెల్‌ఫోన్ల వెలుతురులో ఆందోళన
- ఓయూకు మారిన శిబిరం
- బీఆర్ఎస్ నేతలను అడ్డుకున్న పోలీసులు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 8 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ అభ్యర్థుల ఆందోళన అర్ధరాత్రి దాటాక కూడా కొనసాగుతున్నది. తొలుత సిటీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఆవరణకు, ఆ తర్వాత ఉస్మానియా యూనివర్సిటీకి మారింది. సోమవారం తొలుత విద్యాశాఖ డైరెక్టరేట్ కార్యాలయ ముట్టడితో అభ్యర్థులను పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. గోషామహల్, పేట్ల బురుజులోని సిటీ ఆర్మ్‌డ్ రిజర్వు (కార్) హెడ్‌క్వార్టర్స్, ముషీరాబాద్, గాంధీనగర్ ఠాణాలకు తరలించారు. సాయంత్రానికి నిరసనకారులను ఇండ్లకు వెళ్లాల్సిందిగా పోలీసులు సూచించారు. అదే సమయంలో డీఎస్సీ పరీక్షలను ఈ నెల 18 నుంచి వచ్చే నెల 5 వరకు నిర్వహించనున్నట్టు పాఠశాల విద్యా కమిషనర్ షెడ్యూల్‌ను ప్రకటించారు. దీంతో భగ్గుమన్న డీఎస్సీ అభ్యర్థులు తమ నిరసనను కొనసాగించేందుకే నిర్ణయించారు. అప్పటికప్పుడే కార్ హెడ్‌క్వార్టర్స్ మైదానంలో ఉన్న సుమారు 300 మందికిపైగా నిరుద్యోగ యువత.. ప్రభుత్వం దిగివచ్చే వరకు అక్కడే ఉండి ఆందోళన చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా కార్ హెడ్‌క్వార్టర్స్ మైదానంలో ఉన్న లైట్లన్నింటికీ అధికారులు విద్యుత్తు సరఫరాను నిలపేశారు. కనీసం మంచినీరు కూడా అందుబాటులో లేకుండా చేశారు. అయినా డీఎస్సీ అభ్యర్థులు ఆందోళనను కొనసాగించారు. మహిళలున్నారనే సోయి పోలీసులకు లేకపోవడంపై డీఎస్సీ అభ్యర్థులు మండిపడ్డారు. నిరుద్యోగ యువత కార్ హెడ్‌క్వార్టర్స్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్, బీజేవైఎం ఇతర నాయకులు అక్కడకు చేరుకొని వారికి మద్దతు ప్రకటించారు. ఆందోళనకారులకు మంచినీరు, ఆహారం అందించేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నేత క్రిశాంక్ తదితరులను పోలీసులు అడ్డుకున్నారు. కార్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీసులు ఇబ్బందులకు గురిచేయడంతో నిరుద్యోగ యువకులు నిరసన శిబిరాన్ని అర్ధరాత్రి ఉస్మానియా యూనివర్సిటీ ఆవరణకు మార్చారు. వారంతా ర్యాలీగా ఉస్మానియా యూనివర్సిటీకి చేరుకున్నారు. డీఎస్సీ వాయిదాపడే వరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు.

డీఎస్సీ అభ్యర్థుల ఆందోళనకు మద్దతు తెలుపుతున్న బీఆర్ఎస్ నేత క్రిశాంక్‌ను అడ్డుకుంటున్న పోలీసు

ఏపీకున్న సోయి మన సర్కారుకు లేదా?

అప్పట్లో టెట్ రాయండి అందరికీ అవకాశం కల్పిస్తామన్నారు. టెట్ రాశాం. తీరా వెంటనే డీఎస్సీ పెట్టారు. మాపై సవతి తల్లి ప్రేమను చూపించారు. మన పక్కనున్న ఏపీలో టెట్‌కు 90, డీఎస్సీకి 90 రోజులపాటు ప్రిపరేషన్‌కు గడువు ఇచ్చారు. ఈ సోయి కూడా మన ప్రభుత్వానికి లేకుండాపోయింది.

– కృష్ణ, మహబూబ్‌నగర్

మాది కొడంగల్.. ఓటేసి బాధపడుతున్నం

మాది కొడంగల్ నియోజకవర్గం.కాంగ్రెస్ గ్యారెంటీలను నమ్మి ఓటేశాం. ఆ పార్టీకి ఎందుకు ఓటేశామా? అని బాధపడుతున్నం. కాంగ్రెస్ ప్రభుత్వమే ఈ పరిస్థితి తెచ్చుకున్నది. డీఎస్సీని వాయిదా వేస్తున్నట్టు సీఎం కార్యాలయం నుంచే స్పష్టమైన ప్రకటన రావాలి.

– శ్రీనివాస్, కొడంగల్

తెచ్చుకున్న ప్రభుత్వమే రోడ్డుమీదికి తెచ్చింది

నిరుద్యోగుల వల్లనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొలువు దీరింది. మేం తెచ్చుకున్న ప్రభుత్వమే మమల్ని రోడ్డుమీదికి తెచ్చింది. మా పరిస్థితిని అర్థం చేసుకొని డీఎస్సీ పరీక్షలను 90 రోజులు వాయిదావేయాలి.

– స్వప్న, మహబూబ్‌నగర్

ఆవేదన అర్థం కాలేదా?

ఈ ప్రభుత్వానికి 2.7 లక్షల మంది అభ్యర్థుల ఆవేదన అర్థం కావడం లేదా? మెజార్టీ అభ్యర్థుల అభిప్రాయం తెలుసుకోండి. జాబ్ క్యాలెండర్ అంటూ పక్కదారి పట్టిస్తున్నారు. డీఎస్సీ పరీక్షలను ఆఫ్‌లైన్‌లోనే నిర్వహించండి.

– శ్రీదేవి, హైదరాబాద్

డీఎస్సీ పరీక్షలు యథాతథం

- షెడ్యూల్ ప్రకారమే నిర్వహణ
- 11న హాల్‌టికెట్ల విడుదల
- విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి

హైదరాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ పరీక్షలను మూడు నెలలపాటు వాయిదా వేయాలన్న నిరుద్యోగుల ఆందోళన అరణ్యరోదనగానే మిగిలింది. వారి వేదనను ప్రభుత్వం అస్సలు లెక్కేపెట్టలేదు. డీఎస్సీ పరీక్షలు వాయిదా వేసేదే లేదని సంకేతాలు ఇచ్చింది. ముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు నిర్వహిస్తామని సోమవారం ప్రకటించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ఈ నెల 18 నుంచి ఆగస్టు 5 వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తామని ఒక ప్రకటనను విడుదల చేశారు. దీంతో డీఎస్సీ అభ్యర్థుల ఆశలు నీరుగారినట్టయింది. ఇక అభ్యర్థులు ఈ నెల 11న సాయంత్రం 5 గంటల నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవవచ్చని పేర్కొన్నారు. హాల్‌టికెట్ల కోసం www.schooledu. telangana. gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు. డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని, 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలని కోరుతూ గత కొన్ని రోజులుగా అభ్యర్థులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. టెట్ పరీక్ష నిర్వహించి ఆ వెంటనే డీఎస్సీ నిర్వహించడాన్ని అభ్యర్థులు వ్యతిరేకిస్తున్నారు. రెండు పరీక్షల సిలబస్ వేర్వేరు కాబట్టి డీఎస్సీ ప్రిపరేషన్‌కు కనీసం మూడు నెలల గడువు కావాలని కోరుతున్నారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో అభ్యర్థులు సోమవారం ఏకంగా విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. అయినా ప్రభుత్వం మంకుపట్టు వీడకుండా యథాతథంగా పరీక్షల నిర్వహణకే మొగ్గుచూపింది.

నిరుద్యోగులూ ఆత్మహత్యలు వద్దు!

- ఓటుతో అధికార కాంగ్రెస్ పార్టీని దెబ్బ కొట్టండి
- 30 లక్షల మంది నిరుద్యోగులను మోసగించారు
- రాహుల్‌ను నిలదీసేందుకు 'చలో ఢిల్లీ' చేపట్టండి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రముఖుల పిలుపు
- నిరుద్యోగుల సమస్యలు తీర్చండి: హరగోపాల్, చంద్రకుమార్

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

ఖైరతాబాద్, జూలై 8: నిరుద్యోగులారా ఆత్మహత్యలు చేసుకోవద్దు.. కొట్లాది కొలువులు సాధించండి.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటుతో పాలక కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పండి.. అని పలువురు ప్రముఖులు పిలుపునిచ్చారు. హైదరాబాద్ నగరంలో సోమవారం సిగ్నల్ టీవీ ఆధ్వర్యంలో 'నిరుద్యోగుల సమస్యలు-పరిష్కారాలు-ప్రభుత్వం ముందున్న డిమాండ్లు' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సీనియర్ జర్నలిస్టు వీ శివారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు ప్రముఖులు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు. నిరుద్యోగమనే నినాదంతోనే తెలంగాణ ఉద్యమం ముందుకు సాగిందని ప్రొఫెసర్ హరగోపాల్ తెలిపారు. కానీ ఈ సమస్య తీరలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ వారు ఆందోళన చేస్తూనే ఉన్నారని చెప్పారు. ప్రభుత్వ కొలువుల్లో ఉన్న ఎందరికో లక్షలాది రూపాయలు వేతనాలు ఇస్తున్నారని, ఈ వేతనాలను షేర్ చేసి మరికొంత మందికి అవకాశం కల్పించవచ్చని అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా నిరుద్యోగల సమస్య పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని హితవు పలికారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు అనేక వాగ్దానాలు చేసిందని రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ చెప్పారు. వాటన్నింటినీ నేరవేర్చాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఉన్నదని తెలిపారు.

సర్కారు దిగొచ్చేదాకా పోరాటం: గెల్లు

బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో వేలాది ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చి భర్తీ చేశారని గుర్తుచేశారు. ఇటీవల భర్తీ చేసిన పోస్టులు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నోటిఫికేషన్లు ఇచ్చారని చెప్పారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు విద్యార్థి, నిరుద్యోగుల పక్షాన తమ పోరాటాలు ఆగవని తేల్చి చెప్పారు.

30 లక్షల మందితో చెలగాటం: గాలి

రేవంత్‌రెడ్డి సర్కారు 30 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నదని ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ విమర్శించారు. ఒకవైపు ఉద్యోగాలను భర్తీ చేయకుండా, మరోవైపు ఉన్న ఉద్యోగాలను కుదించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గ్రూప్-1 మెయిన్స్‌లో 1:100 నిష్పత్తి పాటిస్తామని, పోస్టుల సంఖ్య పెంచుతామని స్వయంగా అసెంబ్లీ సాక్షిగా చెప్పిన భట్టి విక్రమార్క ఇప్పుడేమో మాట దాటవేస్తున్నారని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు న్యాయం చేయని సీఎం, డిప్యూటీ సీఎం తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులను మభ్యపెట్టిన రాహుల్‌గాంధీని నిలదీసేందుకు చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టాలని, అప్పుడే సమస్య పరిష్కారమవుతుందని సూచించారు.

పెరిగిన విద్యార్థుల ఆత్మహత్యలు: విఠల్

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగాయని, ఇది పూర్తిగా సర్కారు వైఫల్యమేనని తెలంగాణ విఠల్ తీవ్రంగా విమర్శించారు. గురుకుల అభ్యర్థులు, గర్భిణులు సీఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ కోసం ఇంటికి వెళితే కనీసం వారిపై కన్నెత్తి చూడటం లేదని తెలిపారు. ఇక ప్రజా ప్రభుత్వం ఎలా నడుపుతారని ప్రశ్నించారు. ప్రభుత్వం చేసిన తప్పులను ఎత్తిచూపేందుకు, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించుకునేందుకు మేధావులతో కలిసి నాన్ పొలిటికల్ కమిటీని వేసి ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు.

ముఖం చాటేసిన నేతల వైఖరిపై నిరసన

నిరుద్యోగుల సమస్యల పరిష్కారమే తమ జీవితాశయమని చెప్పుకున్న కొందరు ప్రతినిధులు నిరుద్యోగుల రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరుకాకపోవడాన్ని నిరుద్యోగ యువకులు తీవ్రంగా తప్పుపట్టారు. సమావేశానికి హాజరై నిరుద్యోగుల సమస్యలపై చర్చించాలని నిర్వాహకులు ఆహ్వానం పంపితే కొందరు ముఖం చాటేశారు. వారికి కేటాయించిన చైర్లపై పేర్లు రాసి ఉంచి నిరసన తెలిపారు. ప్రొఫెసర్ కోదండరాం, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, టీ కాంగ్రెస్ స్పోక్స్ పర్సన్ డాక్టర్ కొనగాల మహేశ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్ పేర్లను రాసి వారి నిరసన తెలిపారు.

రౌండ్‌టేబుల్ సమావేశానికి ప్రొఫెసర్ కోదండరాం, రియాజ్, ఆకునూరి మురళి, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, తీన్మార్ మల్లన్న తదితరులు హాజరుకాకపోవడంతో వారికి కేటాయించిన కుర్చీలు ఇలా ఖాళీగా దర్శనమిచ్చాయి.

నిరుద్యోగుల ఆశలపై సర్కారు నీళ్లు

సంజీవ్‌నాయక్

నిరుద్యోగ కొలువుల ఆశలపై కాంగ్రెస్ సర్కారు నీళ్లు చల్లుతుందని సేవాలాల్‌సేన అధ్యక్షుడు భూక్యా సంజీవ్‌నాయక్ ధ్వజమెత్తారు. వేర్వేరు పరీక్షల నడుమ గడువు ఇవ్వకుండా విద్యార్థులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నదని తెలిపారు. జూలై 15 నుంచి ఆగస్టు 5 వరకు డీఎస్సీ పరీక్షలు నడుస్తాయని, ఆగస్టు 7, 8లో గ్రూప్-2 పరీక్షలు పెట్టారని, అక్టోబర్ 24 నుంచి 29 వరకు గ్రూప్-1 మెయిన్స్ పెడుతున్నారని, తిరిగి నవంబర్ 17, 18న గ్రూప్-3 ఉంటుందని తెలిపారు. దీంతో ఒత్తిడిలో నిరుద్యోగులు ఎలా ఉద్యోగాలు పొందుతారని ప్రశ్నించారు. ఉద్యోగాల కోసం రోడ్డెక్కిన నిరుద్యోగులపై నిర్బంధాలు విధించడం అమానుషమని పేర్కొన్నారు. ఎన్నికల ముందు హామీలిచ్చి ముఖం చాటేసిన రాహుల్‌గాంధీతో నిరుద్యోగులు తాడోపేడో తేల్చుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ జనసభ, విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య గౌరవ అధ్యక్షుడు రాజా రాంయాదవ్, సామాజికవేత్త మురళీ మనోహర్, బీజేవైఎం నేత మహేశ్, నిరుద్యోగుల బస్సు యాత్ర ప్రతినిధులు జనార్ధన్, శరత్, పలువురు డీఎస్సీ అభ్యర్థులు, విద్యార్థి, నిరుద్యోగులు పాల్గొన్నారు.

సర్కారు మొండి వైఖరిని వీడాలి

- నిరుద్యోగుల సమస్యలు తీర్చాలి
- నిరసన సెగలతో కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ షురూ..
- ఆమరణ దీక్ష చేస్తున్న బక్క జడ్సన్‌కు బీఆర్ఎస్ నేతల పరామర్శ

బక్క జడ్సన్‌ను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు

హైదరాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి వీడాలని బీఆర్ఎస్ నేతలు, కార్పొరేషన్ల మాజీ నేతలు డిమాండ్ చేశారు. నిరుద్యోగుల హక్కుల కోసం తన ఇంటిలో ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న బక్క జడ్సన్‌ను కార్పొరేషన్ మాజీ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, మేడే రాజీవ్‌సాగర్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, వాసుదేవరెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు తదితరులు సోమవారం పరామర్శించారు. నిరుద్యోగులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నిరుద్యోగుల నిరసన సెగతో కాంగ్రెస్ పార్టీకి కౌంట్‌డౌన్ మొదలైందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, ఏడాదిలోగా 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్-2, 3 పోస్టుల సంఖ్యను పెంచి ప్రిపరేషన్ కోసం పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. బక్క జడ్సన్ డిమాండ్లను పరిష్కరించి, ఆయన దీక్షను విరమింపజేయాలని కోరారు. లేకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆర్ట్స్ కళాశాల ముందు మీడియాతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

యూనివర్సిటీలకు 10 వేల కోట్లివ్వాలి

- వర్సిటీల సమస్యలపై చర్చించాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి

సికింద్రాబాద్, జూలై 8: యూనివర్సిటీల సమస్యలపై విద్యార్థి సంఘాల నేతలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్చించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి డిమాండ్ చేశారు. సోమవారం ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల ఆవరణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని వర్సిటీలకు రాజకీయ జోక్యం లేకుండా సామాజికకోణంలో రెగ్యులర్ వీసీలను, విద్యాశాఖకు మంత్రిని తక్షణమే నియమించాలని, వర్సిటీల అభివృద్ధికి బడ్జెట్‌లో 10 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ నెలాఖరులోగా వీసీలను నియమించకపోతే చలో అసెంబ్లీ చేపడుతామని హెచ్చరించారు. విశ్వవిద్యాలయాల పెండింగ్ ఫైళ్లను వెంటనే క్లియర్ చేయాలని కోరారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని, నూతన విద్యార్థుల పరిశోధనలను ప్రోత్సహించాలని, పీహెచ్‌డీ నోటిఫికేషన్‌ను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ ఓయూ కమిటీ కార్యదర్శి రవినాయక్, ఉపాధ్యక్షులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.